# పిరిగ్గొడ్డు

పాడుపడ్డ డాబామీద చాపేసుకుని పడుకున్న జగన్నాథానికి నిద్ర పట్టడంలేదు.

చాపమీద దొర్లుతున్న జగన్నాథం లేచి చుట్టూ చూశాడు. దూరంగా పెళ్ళాం చిన్న కొడుకును వేసుకుని నిద్రపోతోంది. ఇంకో పక్క రెండో కూతురు పద్మ గచ్చుమీదే హాయిగా పడుకుని నిద్రపోతోంది. జగన్నాథం అలా చాపమీద నిద్రలేమి తనను ఆనారోగ్యంలోకి దింపేస్తుందేమోనని భయపడిపోయాడు. పెళ్ళాన్ని లేపి నిద్రపట్టటంలేదు అని చెప్పి 'ఏం చేయమంటావ్' అని సలహా అడగాలనిపించి, తిడుతుందేమో అని జంకి ఊరుకున్నాడు.

అతనికి ఒక్కసారి ఫ్యాక్టరీ హోరు చెవుల్లో గింగురెత్తి నట్టయింది. ఇరవైమూడేళ్ళయి ఆ దిక్కుమాలిన ఫ్యాక్టరీ తనని ఓ యంత్రంగా చేసి రక్తాన్ని చెమటగా మార్చేస్తోంది.

ఎదుగూ బొదుగూ లేని జీవితం.

స్వేచ్ఛ, స్వతంత్రం లేని జీవితం.

గుర్తింపు లేని జీవితం.

వయసు మళ్ళి, అనుభవం ఉన్నా, ఒక్క సలహాకానీ, సంశయంకానీ తనని అడిగినట్టు జ్ఞాపకంలేదు-ఇటు ఇంట్లోను, అటు ఆఫీసులోను.

ఎందుకడగాలి? నిజమే, తన నెవరూ అడగరు. అటు భార్య అడగదు. ఇటు ఫ్యాక్టరీ మనుషులడగరు- ఒక్క మేనేజరు తప్ప. అదీ తనేదైనా తప్పు చేస్తే ఆ తప్పుకు కసురుతాడు. వీలైతే తిడతాడు.

తన జీవితంలో తిట్లు తిన్న రోజులే ఎక్కువేమో.

మంచీ మర్యాదా లేకుండా మాటిమాటికి మాటల ఈటెలతో పొడిచే గయ్యాళి భార్యనూ ఏమనలేకపోయాడు. తన ప్రేమను తిరస్కరించానని తెలిసి తనని తిట్టి వెళ్ళిపోయిన రాజేశ్వరినీ ఏమనలేకపోయాడు. అప్పుడెప్పుడో ఫ్యాక్టరీ స్ట్రయికులో ఉన్నప్పుడు విధిలేక అప్పు తీసుకున్న డబ్బు టైమ్‌లో ఇవ్వలేకపోయానని తన బామ్మర్ది తిట్టినప్పుడుకూడా ఏమన్లేదు తను. దానికి తన నెమ్మది తనమే కారణమా? ఎదురు తిరగలేని గుండె దౌర్బల్యమా? ఏదీ తెలీదు.

కాని–

తనలోని మనిషిని, మంచిని గుర్తించినవాడు మేనేజింగు డైరెక్టర్ ప్రకాశం. ప్రకాశంకి, తనకి ముప్ఫై సంవత్సరాల పరిచయమే కాదు - దూరపు బంధుత్వం ఉంది. ఆ దూరపు బంధుత్వాన్ని, దగ్గర బంధుత్వంగా స్థిరం చేసుకునే లాలూచీ వ్యవహారం, చొరవ తన దగ్గర లేవు.

కాని ఇన్నేళ్ళ జీవితంలోను ఎదురవని పరిస్థితి నిన్నటి విషయం. ఎనిమిది నెలలయి ఫ్యాక్టరీ అజమాయిషీ మేనేజర్ చేతిలో పెట్టి బొంబాయి వెళ్లిపోయాడు ప్రకాశం. ఈ ఎనిమిది నెలలూ పాంకోర క్రింద బతికినట్టుగా బతికారు కార్మికులు. నెలకు రావలసిన జీతాలు లేవు. బోనసులు లేవు. ఏమైనా అడిగితే లాస్‌లో ఫ్యాక్టరీ నడుస్తోందనీ, సరుకు ఎగుమతి చెయ్యందే ఏం లాభం లేదనీ దబాయింపు.

ప్రకాశమ్మీద, ఫ్యాక్టరీ మీద ఉన్న గౌరవంతో ఏం చెయ్యలేకపోయారు కార్మికులు. కొంతమంది సమ్మె గిమ్మె అని గోల చేసినా, అనుభవజ్ఞులు ప్రకాశం రాకవరకూ ఆగాలని సూచించారు.

ప్రకాశం వచ్చాడు.

కార్మికులకు న్యాయం జరగాలి.

యాజమాన్యం విషయంలో తాము చిక్కుకోకూడదని చెప్పాలి. తగువుగా కాకుండా తగు శాంతియుత పరిష్కారం కావాలి.

ఎవరో తన పేరు సూచించారు.

తను కంగారు పడ్డాడు. ఇంత బాధ్యత తనమీద పెట్టొద్దన్నాడు. సమ్మెలు, దొమ్మీలువల్ల కానిది సదవగాహనవల్ల అవుతుందన్నారు. 'పెద్దవారు ఈ బాధ్యత మీరే మొయ్యా'లని తనపై పెట్టారు. బలవంతమ్మీద ఈ సంప్రదింపుల కొప్పుకున్నా, భయంగా వుంది. రేపుదయం దీని పర్యవసానం ఎలా వుంటుందో ఏమిటో?

"ఏవండీ! ఇంకా కునుకు పట్లేదూ....." భార్య ప్రశ్న.

"లే... లే.... లేదే" కంగారు పడ్డాడు జగన్నాథం.

"ఏవిటా కొంపలు తెగిపోయే ఆలోచనలు, హాయిగా పడుకోక..." భార్య వోసారి ఆవలించి, అటువేపు తిరిగిపోయి సుదీర్ఘ నిద్రలో మునిగిపోయింది.

తన భార్యకివేమీ అక్కర్లేదు. ఇన్నేళ్ళు తనతో కాపరం చేసి, ఇంత జీవితాన్ని తనతో గడిపినా, తన బాధ అర్థంకాదు దానికి. మగవాణ్ణి ఎలా అర్థం చేసుకోవాలో తెలీదు. పోనీ తెలియక పోవచ్చు. తనని కసురుకోవడమే తప్ప పిల్లల్ని ఎలా అదుపులో పెట్టాలో తెలియదు.

జగన్నాథానికి అకస్మాత్తుగా మొన్న రాత్రి జరిగిన రాద్ధాంతం గుర్తు కొచ్చింది.

తను నమ్మలేకపోయాడు.

"శైలజ ఎవడితోనో తిరుగుతోందిట."

"ఎవడే వాడు. ఆ వెధవ ఎవడని? వాడికీ నీకూ ఏవిటి సంబంధం,? ఎంత ధైర్యం లేకపోతే, సరిగ్గా మనింటిముందే స్కూటరాపి నిన్ను దించి, చెయ్యూపి మరీ వెళతాడా? ఎన్నాళ్ళబట్టీ నడుస్తూంది నాటకం......"

గడపలో కాలు పెట్టీ పెట్టగానే భార్య గొంతు కంచుగంటలా మోగుతోంది.

శైలజ మధ్య గది ద్వారబంధానికి ఆనుకుని నిలబడింది.

తన రాక చూసి, పెళ్ళాం మరీ గొంతు పెంచేసింది. తన మీద విరుచుకుపడింది.

"ఇంట్లో విషయాలేవైనా పట్టించుకోవడముందా? అలా ఆ మిల్లులోనే కలిసి బుగ్గి బూడిదైపోతారా!"

"ఏమిటే ఆ మాటలు..... అసలు ఏం జరిగిందో...."

"ఏవిటి జరిగిందా, ఏం జరగాలో ఆదే జరిగింది.... మీ ముద్దుల కూతురు ఎంత లక్ష్యం లేకుండా తిరుగుతోందో దాన్నే అడగండి. హవ్వ, సిగ్గుచేటు.... ఈ మందతో వేగడం నా వల్ల కాదు.... ఎడ్డల్లాంటి పిల్లలకి పెళ్ళి చెయ్యకుండా కాలేజీలకు పంపిస్తే... వాళ్ళేం చదువుతారు. నా భొంద.... బొందనీ."

చరచర లోని కెళ్ళిపోయింది భార్య.

"ఏం లేదు నాన్నా, భానుమూర్తి ఇంటివరకొచ్చి దిగబెట్టి వెళ్ళాడు. దానికి పెద్ద రాద్ధాంతం చేస్తోందమ్మ."

"ఎవడా భానుమూర్తి...?" తుళ్ళిపడ్డాడు తను... పెళ్ళాం గొంతుకి.

"ఏవలా ముంగిలా మాట్లాడరు. వాడెవడో ఆ భానుమూర్తో, గీనుమూర్తో ఇంటికొచ్చిందాక ఇలాగని తెలీదు మనకి. కొంచెం ఈ గుమ్మం దాటి అవతలకు వెళ్ళి చూడండి. అడ్డమైనవాళ్ళూ ఏవనుకుంటున్నారో...."

"ఏవనుకుంటున్నారే?" అమాయకంగా అడిగాడు తను.

"సిగ్గు లేకపోతే సరి ... ఏవనుకుంటున్నారని అడగొచ్చారు. రోజూ వాడితో సిన్మాలట, షికార్లట. ఏమే! వెళుతున్నావా, నిజం చెప్పు..... నిజం చెప్పకపోతే చంపేస్తాను. ఇది ఇలా జులాయిముండలా తిరగటానికి మీరే కారణం....." గయ్‌మంది భార్య.

"నేనేం జులాయిముండలా తిరగటం లేదు.... అతన్తో సరదాగా బీచికి, సిన్మాకీ వెళుతున్నానంతే. అదేం పెద్ద తప్పా..."

"తప్పా... తప్పేనే. తప్పా తప్పున్నరా. పెద్ద తప్పాని అడగొచ్చావ్ వయసొచ్చిన పిల్ల పరాయి మగాడితో బీచులంటూ, పీచులంటూ తిరిగితే తప్పు కాదటే. అందుచేతే చెప్పాను, ఎదిగిన పిల్లకి సంబంధం చూడండీ అంటే.... ఈయనో మొండిఘటం... మొండిఘటమా అని, ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని పెళ్ళి ప్రయత్నమేదో మొదలెట్టండి. తరవాత చేతులు కాలాక ఆకులు పట్టుకుని లాభంలేదు. తెలిసిందా?"

"అమ్మలు చదువుకుంటుంది." శైలజ వేపు చూసి అన్నాడు తను.

"నేను మరి చదవను నాన్నా, పెళ్ళి చేసుకుంటాను. భానుమూర్తి నన్ను పెళ్ళి చేసుకుంటా నన్నాడు." వారం రోజుల నుంచి తండ్రితో చెబుదా మనుకున్న మాటలు చెప్పేసింది శైలజ.

"పెళ్ళా! తనాశ్చర్యపోయాడు. 'చదువుకోవా?' అడగాలనిపించింది. ఎందుకో అడగలేకపోయాడు తను.

"పెళ్ళా. మా బాగానే ఉంది. పెళ్ళి దాకా వచ్చిందండి దీని నిర్వాకం.... ఎంత బరితెగించిందండి... ఎంత ధైర్యమే."

"ఒసేవ్ ఊరుకుంటావా లేదా? ఏమిటా కేకలు. అసలు సంగతేదో తెలుసుకోనీ. ఏమ్మా చెప్పు...."

"అతను మా క్లాస్‌మేట్ నాన్నా. చాలా మంచివాడు. పెద్దిల్లు, బజార్లో బట్టలషాపూ, వాళ్ళ స్వంతూర్లో పొలాలూ అన్నీ బాగానే వున్నాయి నాన్నా.... అతను నన్ను చేసుకోవడం వాళ్ళింట్లో వాళ్ళకిష్టమే... కానీ ఇంటర్ కేస్ట్ మేరేజి..... ఈ కాలంలో పెద్ద తప్పేమీ కాదు....."

జగన్నాథం ఏదో అనబోయాడు కాని అతని కంఠం పెగల్లేదు.

జగన్నాథానికి నిద్ర రావటం లేదు.

చాలాసేపు ఆకాశం వేపు అలా చూస్తూ ఉండిపోయిన జగన్నాథానికి – రాజేశ్వరి జ్ఞాపకాని కొచ్చింది.

అలా డాబామీద పడుకుని, వూసులాడుకుంటూ, వెన్నెల్లో కొతికొమ్మచ్చులాట లాడుకుంటూ, ఏట్లో కాగితపు పడవలు వదులుకుంటూ ఏట్లో అలలాగ, కమ్మని కలలాగ వూరించి గలగలా నవ్వించే తన ప్రాణం రాజేశ్వరి.

రాజేశ్వరి తన కన్న పెద్దో చిన్నో తెలీదు కానీ, తనకంటే చలాకీగా, హుషారుగా ఉండేది చిన్నప్పట్నుంచి. ఒక్కదగ్గరే పెరగటం వల్ల "ఒరే" అని పిలిచేది. దూరం బంధుత్వంకూడా ఉంది తమ మధ్య.

తనూ, రాజేశ్వరీ వాళ్ళ నాన్నగారి దగ్గరే చదువుకున్నారు. ఒక్క క్షణం విడిచి వుండేవారు కాదు. తిన్నా, తిరిగినా ఇద్దరూ ఒకటి.

వేసవి కాలంలో అయితే "ఒరే జగ్గూ, రారా" అని మంచి ఎండలో తాడి పెండెల్లోకి తీసుకుపోయి, ఏ ఏతవాడి చేతో తాటి ముంజలు తీయించి తెచ్చిచ్చి 'తిన్రా' అనేది. చొరవగా తన చెయ్యి పట్టుకుని లాక్కెడుతుంటే తనకి సిగ్గేసేది.

"చెయ్యి వదులు" అనేవాడు తను.

"ఏం సిగ్గా" అనేది రాజేశ్వరి.

"సిగ్గో, గాడిద గుడ్డో" అనేవాడు తను.

"అబ్బోస్ సిగ్గు, రేపు నన్ను నువ్వు పెళ్ళి చేసుకుంటే అప్పుడో" ఎగతాళి చేసేది రాజేశ్వరి.

"అప్పుడు చూద్దాంలే" పరుగెత్తేవాడు తను. అవి చిన్నప్పటిరోజులు.తనకి వయసొచ్చింది. నాన్న పెళ్ళి సంబంధం తెచ్చారు.

"ఆ అమ్మాయి బాగుంటుంది. చదువులేకపోయినా మంచీ, మర్యాదా, పరువూ ప్రతిష్టల్లోంచి వచ్చిన అమ్మాయి.... పేరిశాస్త్రులుగారమ్మాయి. అమ్మాయిని చూస్తావా?"

నాన్న తననే అడిగారు. అ పెళ్ళే తన కిన్ని కష్టాలు తెస్తుందని తెలియని పూర్వం – "ఆ,అక్కర్లేదు, మీరు.... మీరు చూశారు గదా" అన్నాడు తను.

అది భక్తి కాదు, భయంకాదు, అమాయకత్వం అని చాలా రోజులకి తెలిసింది తనకి.

ఆ రోజు సాయంత్రం రాజేశ్వరి తనకు కబురు పెట్టింది. రాత్రి మావిడి తోటలో కలవమని.

తను వెళ్ళేసరికి కొమ్మపలవలో కూర్చుని ఉంది రాజేశ్వరి.

"పెళ్ళి సంబంధం కుదిరిందటగా."

"అవును"

"చేసుకుంటావా"?

"......." మాట్లాడలేదు. ఆ క్షణంలో రాజేశ్వరిని చూస్తే భయమేసింది తనకి. ఇన్నాళ్ళలా రాజేశ్వరి ఎందుకో తనతో మాట్లాడటం లేదో తెలిసింది కాదు. తనక్కూడా మాటలు పెగల్లేదు.

చివరకు రాజేశ్వరి అంది:

"నాకూ సంబంధం కుదిరింది."

"నిజమా!" అనగలిగాడు తను.

"లోకంలో నీకు తప్ప మరెవ్వరికీ పెళ్ళి సంబంధాలు కుదరవా?"

"కుదరవని కాదు." తనకు ఏమనాలో తోచలేదు.

అలా చాలా సేపు గడిపారేతప్ప మాట్లాడుకోలేదు. రాజేశ్వరి మాట్లాడితే బావుణ్ణు అనుకున్నాడు తను. మాట్లాడలేదు. ఇద్దరూ నెమ్మదిగా నడుచుకుంటూ వచ్చారు. 'వస్తాను' మెట్లెక్కుతూ అన్నాడు తను. అప్పుడు చూశాడు ఆమె కళ్ళల్లోకి. ఆ చీకట్లో అంతంత పెద్ద కళ్ళల్లో కన్నీటి మెరుపు!

రెండ్రోజులల్లో తన పెళ్ళి.

ఆ రోజు రాత్రి తన కెందుకో నిద్ర పట్టలేదు. ఆ పల్లెటూర్లో ఆ డాబా మీద పడుకుని ఆ రాత్రంతా ఆలోచిస్తూనే వున్నాడు. అప్పుడూ ఇదే చంద్రుడు. ఇదే వెన్నెల్ని పిచ్చిగా అందరిమీదా వెదజల్లుతూ చిన్న కుర్రాడిలా తిరుగుతున్నాడు.

దూరంగా పెళ్ళి సంబరం

రాత్రి రెండు గంటలకు రాజేశ్వరి పెళ్ళి.

అందుచేతే నిద్రరావటంలేదు అనిపించింది తనకి. ఏదో చప్పుడికి ఉలిక్కిపడి చూశాడు.

మంచం పక్కన ఆకారం. సులభంగా గుర్తుపట్టాడు తను.

రాజేశ్వరి!

నువ్వా! తనకి గాభరా పుట్టింది. ఎవరైనా చూస్తే ఏమనుకుంటారు. ఎంత నవ్వులపాలు. అదే మాటన్నాడు రాజేశ్వరితో.

"అనుకోనీ - నాకేం భయం లేదు. నువ్వూ, నేనూ పెళ్ళి చేసుకుంటున్నాం అని చెపుతాను."

"పెళ్ళా, మనకా. నీకేం పిచ్చెక్కిందా." రాజేశ్వరి ధైర్యానికి ఆశ్చర్యపోయాడు తను.

"అవును. పిచ్చే ఎక్కింది. తోబుట్టువుగానో, తల్లిగానో తప్ప మరే విధంగానూ చూడలేని నీ పిరికితనాన్ని చూసి. చిన్నపట్నుంచి కలిసి మెలిసి తిరిగినా ఆడపిల్ల మనస్తత్వం అర్థం చేసుకోని నీ ఆడంగితనాన్ని చూసి....'

'రాజేశ్వరి వెక్కి వెక్కి ఏడుస్తూంది. ఓదార్చటానికి తనకి మాటలు పెగల్లేదు.

రాజేశ్వరి విసురుగా "వస్తాను" అంటూ మెట్లు దిగుతూ చివర మెట్టు దగ్గర నిలబడి తనవేపు చూస్తూ "పిరిగ్గాడ్డు" అనేసి చీకట్లోకి వెళ్ళిపోయింది.

"నిజవే. తను "పిరిగ్గాడ్డు". నిజవే రాజేశ్వరీ. నిజం నీవన్నది నిజం. ఈ జగన్నాథం పిరిగ్గాడ్డు." తనలో తాను ఆ రాత్రి గొణుక్కున్నాడు.

ఎంతమందికో సంతోషాన్నీ, స్వర్గాన్నీ పంచిపెడుతున్న ఈ చీకటి రాత్రి... తననెందుకు ఇంత బాధల ముళ్ళతో గుచ్చుతూంది. ఆలోచన నరకకూపంలోకి తోస్తూంది?

జీవితంలో చాలా పోగొట్టుకున్నాడు. - ఆలా అని ఈ అర్ధరాత్రే ఈ విషాద నిశీధిలోనే తెలిసింది. జగన్నాథానికి దాని క్కారణం కూడా తెలిసొచ్చింది. బతుకును కుంగదీయటానికి పిరికితనం అనారోగ్యం కన్నా బలమైందని ఇన్నేళ్ళ జీవితంలో మొట్టమొదటిసారిగా ఈ రాత్రే తెలిసింది.

"పిరిగ్గాడ్డు."

'కాదు. రాజేశ్వరీ కాదు. ఈ జగన్నాథం పిరిగ్గాడ్డు కాదు' ఆవేశంతో, అరవాలనిపించింది.

ఆ అర్ధరాత్రి శైలజని లేపి భానుమూర్తితో నీ పెళ్ళి నేను దగ్గరుండి జరిపిస్తానని చెప్పాలనిపించింది.

ఫ్యాక్టరీలో ప్రకాశంతో మాట్లాడి న్యాయం జరిపించాలి.

అభిమానాన్ని, పౌరుషాన్ని చంపుకుని, బాధల్ని వేదనల్ని తన్లో తను దిగమింగి, చేతకానివాడిలా ఇన్నేళ్ళ సర్వీసును మోస్తూ నసుగుతూ బ్రతికిన పంతులేనా ఈ జగన్నాథం అని తన మార్పుకు ఆశ్చర్యపోవాలి.

అప్పటివరకూ సమస్యల చిక్కు ముడులవల్ల అప్పణ్ణించి సంతోషంవల్ల జగన్నాథానికి ఆ రాత్రి మరి నిద్ర పట్టలేదు. ఎప్పుడు తెల్లారుతుందో అని చాపమీద కాచుక్కూచున్నాడు.

తెల్లగా తెల్లవారింది.

అంత వెలుగు ఊరంతా నిండినా తన మనసులో కొండంత చీకటి ముసురుకున్న ట్లనిపించింది.

"భయం చెప్మంటే చెప్పారూ... ఇప్పుడది కొంపముంచింది. వాడెవడితోనో లేచిపోతూ ఉత్తరం రాసి పెట్టి వెళ్ళిపోయేటంత అలుసిచ్చింది మీరే..... నలుగుర్లో ఎలా తలెత్తుకోవడం. అది ఊరు దాటక ముందే వెతికి తీసుకురండి వెళ్ళండి."

భార్య భరతనాట్యం చేస్తోంది.

"అలాగేవే" అన్లేదు జగన్నాథం.

తొందరపడింది అని మనసులో అనుకున్నా "వెళ్ళనీ. పెళ్ళి చెయ్యలేని ఈ తండ్రి అసమర్థతకి నలుగురిచేత నానా మాట లనిపించుకోకముందే మంచి పని చేసింది. నేను చేద్దామనుకున్న పని అదే చేసింది."

"మీరు చేద్దామనుకున్న పనా? మీకేం మతిపోయిందా? పరువూ ప్రతిష్టా... మీ కేం పిచ్చి..." ఎరుపెక్కిన భర్త కళ్ళల్లోకి చూసి ఆగిపోయింది భార్య ఇన్నేళ్ళలో కనబడని ఎరుపది.

ఇప్పుడు తన నెవడూ అడ్డలేరు. తన కిక భయానికి తావులేదు. ఎప్పుడయినా తిరుగొస్తే ఆ జంటని మనసారా ఆశీర్వదించి ఆదరించాలనుకున్నాడు. పై గుడ్డ భుజమ్మీద వేసుకుని గబగబా అడుగులేసుకుంటూ ఫ్యాక్టరీ వేపు నడిచాడు జగన్నాథం.

ఇన్నేళ్ళ తరవాత భర్తలోని ఈ వింత వైఖరికి ఆశ్చర్యపోవడం తప్ప ఏమిటో అర్థం కాలేదు జగన్నాథం భార్యకు.

ఆంధ్రప్రభ వీక్లీ - 8-6-1976

*